సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తా : సీఎం చంద్రబాబు

కొత్తపేట, ఆగస్టు 23: రాష్ట్రంలో ఎక్కడ అవినీతి జరిగినా తనకు సమాచారం వస్తుందని, ఆ ప్రాంతాల్లో సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికారులు అందరూ నిబద్ధతతో పనిచేయాలి. నేను ఏ ప్రభుత్వ కార్యాలయానికి వస్తానో ముందుగా ఎవ్వరికీ తెలియనివ్వను. ప్రజలతో మమేకమై ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు.



ప్రజల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు



పల్లెలను అభివృద్ధి చేస్తా : వానపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న చంద్రబాబు



జై చంద్రబాబు : చంద్రబాబుకు ప్లకార్డులతో మహిళల స్వాగతం



మీకు నేనున్నా : గ్రామస్తులకు అభయమిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



వానపల్లి గ్రామస్తులకు చంద్రబాబు అభివాదం

పల్లెకొచ్చిన.. చంద్రుడు

వానపల్లిలో చంద్రబాబు వరాల జల్లు

సర్పంచ్ అడిగారని.. వానపల్లికి రూ.10 కోట్లు

కొత్తపేట, ఆగస్టు 23 : సీఎం చంద్రబాబునాయుడు వానపల్లిలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ పల్లి భీమారావును మెచ్చుకున్నారు. మూడుసార్లు సర్పంచ్‌గా పనిచేస్తున్నాడంటే అతని అవినీతిరహితమైన పరిపాలనను ప్రజలు గుర్తించారన్నారు. అలాగే వానపల్లి అభివృద్ధికి 16 విభాగాల పనులకు సంబంధించి సుమారు రూ.10 కోట్లు అవుతాయని తనకు నివేదిక ఇచ్చారని, వాటన్నింటినీ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలతో మమేకమై పనిచేస్తేనే ప్రజలే పట్టంగడతారని అన్నారు.

- గ్రామాల రూపురేఖలు మారుస్తా
- డ్వాక్రా మహిళల అభివృద్ధికి కృషి
- రైతులకు అండగా ఉంటా
- మూడు పంటలకు నీళ్లిస్తా
- పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తా
- తోటివారిని దత్తత తీసుకోండి
- ఉమ్మడి జిల్లాలో సీఎంగా తొలిసభ సక్సెస్

అమలాపురం/కొత్తపేట,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పల్లెకు చంద్రుడొచ్చాడు..వెలుగులు తెచ్చాడు.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని వానపల్లిలో వరాలజల్లు కురిపించాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో సీఎం చంద్ర బాబు పాల్గొని మాట్లాడారు. పెట్టుబడి తగ్గించి ఆదాయం పెరిగేలా రైతులు వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పెట్టుబడిని తగ్గించే ప్రకృతి సేద్యం చేసేలా ప్రోత్సహిస్తాం. రాష్ట్రంలో వర్షాలు పడడం శుభసూచకం. రాబోయే రోజుల్లో కరువు అనేది రాదు. ఇక్కడే పోలవరం ప్రాజెక్టు ఉంది. వీలైనంత త్వరలో దాని పూర్తిచేసి గోదావరి జిల్లాల ప్రజలకు మూడు పంటలకు నీళ్లిస్తామని స్పష్టంచేశారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఇటీవల రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. 48 గంటల్లోనే ధాన్యం బకాయిలు చెల్లించే విధానాలతో ప్రభుత్వం ముందుకు వస్తోందని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు రూపకల్పనచేసిన తానే.. ఆయా సంఘాల్లో ఉన్న మహిళల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని చెప్పారు. గ్రామాల్లోని మహిళల ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి పొందుతూ ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు కింది స్థానంలో ఉన్న వారిని దత్తత తీసుకుని వారి ఆదాయం పెంచే విధంగా సహకరించాలని సూచించారు. జన్మభూమి స్ఫూర్తితో ఈ తరహా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. సభలో చంద్రబాబు ఎవరి పేర్లను ప్రస్తావించకుండానే ప్రసంగాన్ని ముగించేశారు. గ్రామసీమల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఇస్తున్న అధిక ప్రాధాన్యతలను మాత్రం సభలో పదేపదే ప్రస్తావించడం ద్వారా ప్రజలను ఆకట్టుకోగలిగారు.

రెండున్నర గంటలపాటు గ్రామసభ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. రెండున్న గంటలపాటు సభ జరగ్గా గంటా 20 నిమిషాలపాటు చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. మధ్యాహ్నం 2.20 గంటలకు అయినవిల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న కాన్వాయ్‌లో వానపల్లికి మధ్యాహ్నం 2.50 గంటలకు వానపల్లి చేరుకున్నారు. అక్కడ నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వానపల్లి పళ్లాలమ్మవారి ఆలయంలోకి వెళ్లిన చంద్రబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నేరుగా సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన గ్రామసభ జరిగే వేదిక వద్దకు చేరుకున్నారు. సర్పంచ్, ఏపీడీల ప్రసంగం తరువాత నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు గంటా 20 నిమిషాలపాటు అనర్గళంగా ప్రసంగించడంతో ఎమ్మెల్యే బండారు, ఎంపీ హరీష్‌మాధుర్‌లకు మాట్లాడే అవకాశం రాలేదు. చంద్రబాబు ప్రసంగం తరువాత గ్రామస్తుల్లో కొందరికి అవకాశం కల్పించారు. చంద్రబాబు సభావేదికపైకి రాకముందు మాలమహానాడుకు చెందిన కొందరు కార్యకర్తలు సభలోకి ప్రవేశించడంతో వారిని గుర్తించిన పోలీసులు తక్షణమే సభాప్రాంగణం నుంచి బయటకు తీసుకెళ్లారు. వేదికపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు ఉన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతికి వేదికపై సీటు లేకపోవడంతో మీటింగ్ జరుగుతున్నంతసేపు నిలబడే ఉన్నారు. సభా వేదిక పక్కనే ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణతో సహా అనేకమంది కీలక నాయకులంతా సభావేదిక పక్కనే కుర్చీల్లో ఆశీనులు కావడం కనిపించింది.



సీఎంతో రేజ్‌నాయుడు

మా గ్రామంలో ఫ్యాక్టరీ పెట్టించండి సార్..

ఒక యువకుడి కోరిక.. కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు

అమలాపురం/కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ యువకుడు తాను మాట్లాడతానని పెద్దగా అరిచాడు.. ఇది గమనించిన సీఎం అతడిని వేదికపైకి పిలిచి మైకు ఇచ్చారు. అతను ఏఐ వస్తుంది కదా సార్ ఏం చేస్తారని ప్రశ్నించాడు. ఇంతలో మరో యువకుడు మాట్లాడేందుకు వేదిక దగ్గరికి వచ్చాడు. ఇటు రావయ్యా అంటూ అతడిని పిలిచి బాబు మైకు అందించారు. వేదికపై పాల్గొన్న అందరి పేర్లు సంబోధిస్తూ ఏలూరి శ్రీనివాసధనరాజు (రేజ్‌నాయుడు) ప్రసంగాన్ని ప్రారంభించాడు. అక్కడే ఉన్న మహిళలను చూపించి వీరంతా ఈ ఊరి నుంచి సుమారు 40 కిలోమీటర్లు వెళ్లి రవళి స్పిన్నింగ్ మిల్‌లో షిఫ్టుల వారీగా పనులు చేస్తున్నారు. ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. ఇక్కడే ఏదైనా మహిళలకు ఉపాధి కలిగే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. దానిపై చంద్రబాబు స్పందించి ఇక్కడ మహిళలకు ఉపాధి కలిగేలా ఫ్యాక్టరీ ఏదైనా నెలకొల్పేందుకు చర్యలు తీసుకోండని కలెక్టర్‌కు సూచించారు. ఎంతో మహిమగల అమ్మవారు పళ్లాలమ్మ తల్లి. ఆమె చుట్టూ ప్రకృతివనం ఒకటి ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. వెంటనే స్పందించిన చంద్రబాబు పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. నువ్వు ఏం చేస్తావని అతడిని అడిగినప్పుడు నేను ఆటో నడుపుతాను అని బదులిచ్చాడు. అయితే నీకు ఎలక్ట్రికల్ ఆటో తీసి ఇస్తా నడుపుకుంటావా అని చంద్రబాబు అనగా అందుకు ఆ యువకుడు ఈ రోడ్లలో ఎలక్ట్రికల్ ఆటో పనికిరాదు సార్ అంటూ సున్నితంగా తిరస్కరించాడు. సామాజిక స్పృహ ఉన్న ఇటువంటి యువకుడు సమాజానికి అవసరమంటూ చంద్రబాబు అభినందించారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు అవకాశాలను గుర్తించి బండారు సత్యానందరావు ద్వారా తనకు నివేదిక పంపాలని, వాటిని మంజూరు చేస్తామని చెప్పారు. గంధ్రేతు సతీష్ అనే యువకుడు మాట్లాడుతూ గౌతమీ గోదావరి నది మధ్యలో కృష్ణ జింకల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు టీడీపీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఆకుల రామకృష్ణకు పార్టీ నామినేటెడ్ పదవి ఇవ్వాలని చంద్రబాబును అభ్యర్థించారు. వానపల్లి గ్రామానికి చెందిన కంచుస్తంభం లక్ష్మణరావు మాట్లాడుతూ మీతోనే రాష్ట్ర భవిష్యత్ అంటూ చెప్పడంతో సీఎం చంద్రబాబు అతడిని భుజం తట్టారు. అనంతరం చింతపల్లి కిరణ్, ఇళ్ళ సత్తిబాబులకు ఎలక్ట్రికల్ బైక్‌లు, చల్లపల్లికి చెందిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణకు ఒక ఇల్లు, రూ.లక్ష ఆర్థిక సాయం చేయమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను ఆదేశించారు.



బాబుతో పోలవరం ప్రాజెక్టు అధికారి



బాబుకు యువకుడి జ్ఞాపిక



మీ వెంటే బాబు : గ్రామసభకు హాజరైన జనం



సీఎంకు సమస్య విన్నవిస్తున్న వృద్ధ దంపతులు



లక్ష్మణరావుకు అభినందన



దివ్యాంగుడి సమస్య వింటున్న చంద్రబాబు

పల్లెకు పండగొచ్చింది

- జిల్లావ్యాప్తంగా వేడుకలా గ్రామసభలు
- 385 పంచాయతీల్లో సభల నిర్వహణ
- గ్రామ సమస్యలు, అవసరాలపై స్థానిక ప్రజలతో కూలంకషంగా సమీక్షలు
- చిత్రాడ గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పల్లెలకు పండగొచ్చింది. ఐదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల బాగోగులు పట్టించుకునే ప్రభుత్వం రావడంతో ఎక్కడికక్కడ పండగ వాతావరణం వెల్లివిరిసింది. గడచిన అయిదేళ్ల వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలపై దృష్టిసారించింది. పల్లెల్లో సమస్యల పరిష్కారం దగ్గరనుంచి వాటి రూపురేఖలను సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఒకేరోజు 385 పంచాయతీల్లో గ్రామసభలను రికార్డుస్థాయిలో నిర్వహించింది. పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారులు, కొందరు సచివాలయ సిబ్బంది కలిసి పంచాయతీ పరిధిలో ప్రజలతో సభలు నిర్వహించారు. గ్రామ సమస్యలపై ప్రజలతో చర్చించారు. గ్రామసభల్లో అధికంగా రహదారులు, పారిశుధ్యం, వీధిదీపాల సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. సభలు ముగిసిన తర్వాత చర్చించిన అంశాలపై తీర్మానాలు చేశారు.



పిఠాపురం మండలం చిత్రాడలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టర్ షాన్‌మోహన్ పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ సభలో మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి పాల్గొన్నారు. గ్రామసభల్లో చర్చించిన అంశాలపై తీర్మానాలు చేసి ప్రాధాన్యతప్రకారం పనులు చేస్తామని వివరించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక పేరుతో విజన్-2047 రూపొందిస్తున్నామని, తద్వారా ప్రభుత్వం పల్లెల రూపురేఖలు మార్చబోతోందని వివరించారు. పెద్దాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చినరాజప్ప, ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడిలో ఎమ్మెల్యే సత్యప్రభ గ్రామసభలకు హాజరయ్యారు. జగ్గంపేటలో పలుచోట్ల ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తదితరులు గ్రామసభలకు హాజరయ్యారు. గ్రామసభలు జిల్లాలో కొన్ని చోట్ల రసాభాసగా మారాయి. గొల్లప్రోలు మండలం వన్నెపూడి సభలో సర్పంచ్, జనసేన వర్గీయుల మధ్య గొడవ ముదిరి తన్నుకునే వరకు వెళ్లింది. కాకినాడ రూరల్ నియోజకవర్గం సర్పవరంలో గ్రామసభలో జనసేన ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే పంతం నానాజీ ఫొటోలు లేకపోవడంతో నేతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం ఉండూరు గ్రామసభ రసాభాసగా మారింది. ఎమ్మెల్యే కార్య క్రమం రద్దవడంతో అధికారులు వెళ్లిపోయారు.

వన్నెపూడి గ్రామసభలో ఇరువర్గాల మధ్య వివాదం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 23: గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామసభలో సర్పంచ్, జనసేన వర్గాల మధ్య వివాదం ముదిరి కుర్చీలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. వన్నెపూడిలో శుక్రవారం సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముగింపులో సర్పంచ్ వర్గానికి చెందిన మొయిళ్ల శివ, కందా రామకృష్ణ గతంలో ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంలో జరిగిన అవకతవకల వివరాలు చెప్పాలని డిమాండ్‌చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సమాధానమిస్తున్న దశలో జనసేన వర్గానికి చెందిన కందా శ్రీధర్ గతాన్ని వదిలి ఇకనుంచి ఉపాధి పథకాన్ని పటిష్ఠంగా అమలు చేద్దామన్నారు. దీనితో రెండు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. ఇరువర్గాలు పరస్పరం కుర్చీలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాలవారు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

ఉండూరులోను రసాభాస

సామర్లకోట, ఆగస్టు 23: మండలంలోని ఉండూరులో గ్రామసభ రసాభాసగా మారింది. మద్యం బెల్ట్ దుకాణాలు తొలగించాలని ఫిర్యాదు చేస్తే తమపై అక్రమార్కులకు సమాచారం ఇవ్వడమేంటని మహిళలు ప్రశ్నించారు. హౌస్సేన్‌పురంలో గృహనిర్మాణాల రుణం మంజూరు కాకపోవడంపై ధ్వజమెత్తారు.

జేసీగా రాహుల్‌మీనా బాధ్యతల స్వీకరణ



కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23: జిల్లా జేసీగా రాహుల్ మీనా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో ఆయన జేసీగా బాధ్యతలు స్వీకరించారు. 2021వ బ్యాచ్‌కి చెందిన రాహుల్‌మీనాది రాజస్థాన్ రాష్ట్రం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఆయనను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు కాకినాడ రానున్న ఎంపీ పురందేశ్వరి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 23: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడలోని విద్యుత్తునగర్ చల్లా కల్యాణ మండపంలో నిర్వహించే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విచ్చేస్తున్నారని ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉచిత ఇసుక విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23: ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి ఉచిత ఇసుక విధానంపై జిల్లాల కలెక్టర్లు, జేసీలతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా కలిసి హాజరయ్యారు. పలు అంశాలపై ముఖేష్ కుమార్‌మీనా చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లభ్యత, వినియోగంపై ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు.

మాతృ, శిశు మరణాలు నియంత్రణపై కలెక్టర్ సమీక్ష

కాకినాడ సిటీ, ఆగస్టు 23: సురక్షితమైన ఆస్పత్రి ప్రసవాలు ద్వారా మాతృమరణాలు, శిశు మరణాలు అరికట్టవచ్చని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. మాతృమరణాలు, శిశు మరణాలు అరికట్టడం, పీఎంఎస్ఎంఎలపై శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. మాతా,శిశు మరణాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై కలెక్టర్ సూచనలు చేశారు. జిల్లావైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం ద్వారా 4వ నెల నుంచి 9వనెల మధ్య గల గర్భిణులకు ప్రతినెలా 9,10 తేదీల్లో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎంవో డబ్ల్యుహెచ్‌వో జేజే జాషువా, ఇన్‌చార్జి జిల్లా డీఐవో డాక్టర్ శ్రీనివాసనాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన రుణాలివ్వాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23: ఈఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన రుణాలను విరివిగా మంజూరు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో కలిసి డీసీసీ, డీఎల్ఆర్సీ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆర్‌బీఐ ఎల్డీవో పూర్ణిమ, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, నాబార్డు డీడీఎం సోమినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలోని 72 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు.

ఎన్టీఆర్ వైద్యసేవా పథకం అమలు కావాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలు డిస్ట్రిక్ డిసిప్లినరీ కమిటీ సమావేశాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవా పథకం పటిష్ఠంగా అమలు చేయాలని, నగదు రహిత వైద్యం రోగులకు అందించాలని అన్నారు.డీఎంహెచ్‌వో నరసింహనాయక్, డీసీహెచ్ఎస్ స్వప్న, ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా కోఆర్డినేటర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమీక్ష

కాకినాడ సిటీ, ఆగస్టు 23: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కలెక్టరేట్ కోర్టు హాల్‌లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.

స్టాకును నియంత్రణలోకి తీసుకుంటాం

- జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

కాకినాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీలను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో 'బ్లాక్ దందా' శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి స్పందిస్తూ హోల్‌సేల్ డీలర్లవద్ద ఉన్న డీఏపీని వ్యవసాయశాఖ నియంత్రణలోకి తీసుకుని రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌కు, అధిక ధరలకు విక్రయించే సమస్య ఉండదని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయాధికారి వివరణ క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. యూరియాను శుక్రవారం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బస్తాకు రూ.300 నుంచి రూ.350 వరకూ విక్రయిస్తున్నట్లు, డీఏపీని రూ.1450 వరకూ విక్రయించినట్లు రైతులు చెబుతున్నారు.





కోనసీమలో సీఎంకు ఘన స్వాగతం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం పర్యటించారు. కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించిన స్వర్ణ గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను అయినవిల్లిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్ద కలిశారు. సీఎంకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.







సత్యనారాయణ స్వామి వ్రతమాచరిస్తున్న నవ దంపతులు

నూతన దంపతులతో సందడిగా సత్యదేవుని సన్నిధి

అన్నవరం, ఆగస్టు 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధి శుక్రవారం నూతన దంపతులతో కిక్కిరిసింది. గురువారం రాత్రి రత్నగిరిపై ఒక్కటైన జంటలతో పాటు వివిధ ప్రాంతాల్లో వివాహం చేసుకున్న నూతన దంపతులు సత్యదేవుని వ్రతమాచరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన దంపతులను అంతరాలయంలో స్వామివారి దర్శనానికి ఉచితంగా అనుమతించారు. శుక్రవారం 3వేల వ్రతాలు జరగ్గా సుమారు 500 కొత్త జంటలు వ్రతమాచరించాయి. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.30లక్షల ఆదాయం వచ్చింది.



గంజాయితో దొరికన బిహార్‌వాసులను చూపిస్తున్న పోలీసులు

కిలో గంజాయి పొట్లాలతో ఇద్దరు బిహారీల అరెస్టు

కాకినాడ క్రైం, ఆగస్టు 23: కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీచ్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రవీందర్ యాదవ్, రాజేష్ ఠాగూర్ శుక్రవారం మధ్యాహ్నం సమయంలో బీచ్ రోడ్డులోని సాత్విక్ గొడౌన్స్ ఎదురుగా గంజాయిని చిన్న పొట్లాలుగా కట్టి అధిక డబ్బుల కోసం గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సుమారు కిలో గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత?

గోకవరం, ఆగస్టు 23: రంపచోడవరం నుంచి గోకవరం వైపు బొలెరో వాహనంలో తరలిస్తున్న గంజాయిని గోకవరం మండల పరిధిలోని రామన్నపాలెం సమీపంలో పోలీసులు పట్టుకున్నట్టు తెలియవచ్చింది. భారీ స్థాయిలోనే గంజాయి దొరికిందని, తరలిస్తున్న వ్యక్తులు పరారైనట్టు విశ్వసనీయ సమాచారం. గంజాయితో పట్టుబడిన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్టు స్థానికులు చెప్తున్నారు.




గంజాయి తరలిస్తున్న వాహనం, గంజాయి సంచులు

ఆ యువతి ఏమైందో!

యానాం, ఆగస్టు 23: యానాం ఫెర్రీ రోడ్డులోని జీసస్ విగ్రహం సమీపంలోని రాజీవ్ బీచ్ వద్ద గుర్తు తెలియని యువతి శుక్రవారం గౌతమి గోదావరిలోకి నడుచుకుంటూ వెళ్లిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న వ్యక్తి ఆమెను కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. గోదావరిలో గల్లంతైంది. ఆమె కుడి కాలు చెప్పు మాత్రమే లభ్యమైంది. 18-20ఏళ్ల మధ్య వయసున్న ఆమె తెల్ల రంగు చున్నీ ధరించినట్టు స్థానికులు తెలిపారు. పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు.



బీచ్ సమీపంలో దొరికిన యువతి కుడి కాలి చెప్పు




సతీష్‌ను గుర్తు చేసుకుని విలపిస్తున్న కుటుంబ సభ్యులు, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

తల్లడిల్లిన హృదయం

చేతికందివచ్చిన కొడుకు మృతితో కన్నీరుమున్నీరైన సతీష్ మాతృమూర్తి

మామిడికుదురు, ఆగస్టు 23: చేతికి అందివచ్చిన కొడుకు ఆసరాగా నిలుస్తానుకున్న ఆ తల్లి ఆశ అడియాస అయ్యింది. అచ్యుతాపురంలోని ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమంలో జరిగిన విస్ఫోటనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ (33) మరణించిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసి సతీష్ తల్లి పద్మావతి, భార్య వెంకట నాగమణి విలపించిన తీరు చూపరులను కలచివేసింది. సతీష్ తండ్రి కొబ్బరి బోదీలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. తల్లి గృహిణి కాగా సోదరుడు రమేష్ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడైన సతీష్ ఉద్యోగంలో స్థిరపడి కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న సమయంలో మృత్యువు కాటేసిందంటూ ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. 25 రోజుల క్రితం ఇంటికి వచ్చిన సతీష్ ఇలా విగతజీవిగా రావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సతీష్ అంత్యక్రియలను శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలో నిర్వహించారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటి చెక్కును సతీష్ కుటుంబానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొరుసు సత్తిబాబు వున్నారు.



మారిశెట్టి సతీష్ (పాత చిత్రం)

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందజేత



గణేష్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కొప్పర్తి గణేష్‌కుమార్ మృతదేహాన్ని శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు తీసుకువచ్చారు. విషయం తెలిసిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గణేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటి చెక్కు అందించి అన్ని విధాలా ఆదుకుంటుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి, నేతలు పాలచర్ల శివ ప్రసాద్‌చౌదరి, సింగారపు రామారావు, వెంకటేష్, మధు, ఆర్డీవో కె.శివజ్యోతి, తహసీల్దారు డబ్ల్యు లక్ష్మీరమణి తదితరులు పాల్గొన్నారు.



నాగబాబు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా సెజ్ విస్ఫోటనంలో మృతి చెందిన అసిస్టెంట్ మేనేజరు నాగబాబు కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. నాగబాబును తీసుకురావడం ఎవరితరం కాదని, అతడి కుటుంబానికి భరోసా ఇస్తామని చెప్పి ఓదార్చారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటిని చెక్కు రూపంలో సామర్లకోట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి నాగబాబు కుటుంబీకులకు టీడీపీ, జనసేన నాయకుల సమక్షంలో అందజేశారు.



హారిక తల్లి అన్నపూర్ణకు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు జితేంద్ర

సర్పవరం జంక్షన్, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన ట్రైనీ ఇంజనీరు చల్లపల్లి హారిక తల్లి అన్నపూర్ణకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెక్కును అర్బన్ తహసీల్దారు జితేంద్ర అందజేశారు. ఆ సమయంలో అన్నపూర్ణ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఒక్కగానొక్క కుమార్తె జీవించి లేనప్పుడు తాను ఎవరి కోసం బతకాలని, ఈ డబ్బులు ఏం చేసుకోవాలని బోరున విలపించింది. దీంతో ఆమెను అధికారులు సముదాయించారు.





రెండో రోజు అంతర్జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, 60 పరిశోధనా రచనలు చేసిన డాక్టర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రముఖులు

సైన్స్‌తోనే మానవాళి మనుగడ

విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలి

అంతర్జాతీయ సెమినార్ ముగింపు సభలో వక్తలు

మండపేట, ఆగస్టు 23: సైన్స్‌తోనే మానవ జీవితం ముడిపడి ఉందని దక్షిణ కొరియా శాస్త్రవేత్త కె.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్‌పట్ల అవగాహన పెంచుకుని నూతన పరిశోధనలు చేయాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు జరిగిన అంతర్జాతీయ సెమినార్ ముగింపు సభ శుక్రవారం జరిగింది. నవీన్‌కుమార్ తో పాటు మరో శాస్త్రవేత్త ఎ.భార్గవ్ తాము చేసిన ఫ్లోరోసిక్ పౌడర్, ఎల్ఈడీలు అనే పరిశోధనలపై ప్రసంగించారు. ఆర్ఎంటీ యూనివర్సిటీ (నాగపూర్) ప్రొఫెసర్ సంజీవ్‌డోగేల్ నానో మెటీరియల్స్, నానో ఇంజన్ల గురించి విద్యార్థులకు వివరించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మానవాళికి అవసరమైన టెక్నాలజీతో పాటు అనేక పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సెమినార్‌ను విజయవంతం చేసిన ఘనత అధ్యాపకుడు కె.శ్రీనివాస్‌కు దక్కుతుందన్నారు. సదస్సు నిర్వహణకు సహకరించిన దాతలకు ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కె.శ్రీనివాస్ పరిశోధించిన 60 రిపోర్టులను పుస్తకంగా తయారు చేసి ఆవిష్కరించారు. నేటి యువతకు, విద్యార్థులకు ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు వక్తలు అన్నారు. నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతలను అలవాటు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సెమినార్ విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. సెమినార్‌ను విజయవంతంగా నిర్వహించిన కె.శ్రీనివాస్‌ను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మితో పాటు విదేశాలు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలను సత్కరించి మెమెంటోలు అందజేశారు.



2.800 గ్రాముల బరువుతో చిన్నారి

నాడు బక్కగా... నేడు బొద్దుగా

చింతూరు సీహెచ్‌సీలో శిశువుకు అరుదైన వైద్యం

80 రోజుల తర్వాత కోలుకున్న వైనం

చింతూరు, ఆగస్టు 23: ఏజెన్సీలో అప్పుడే పుట్టిన బిడ్డ ప్రాణపాయ స్థితిలో ఉండడంతో 80 రోజులు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి తల్లి కళ్లల్లో ఆనందం నింపారు. వీఆర్ పురం మండలం దారపల్లి గ్రామానికి చెందిన అందేలా సుభద్ర ఏడవ నెలలోనే పురిటి నొప్పులు వస్తున్నాయని జూన్ 3న చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు వచ్చింది. ఆమె మగ శిశువుకు జన్మనివ్వగా బరువు సుమారు 0.936 గ్రాములు మాత్రమే ఉంది. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది శిశువు ప్రాణపాయ స్థితిని గుర్తించారు. నెలలు పూర్తిగా నిండకపోవడంతో తల్లి గర్భంలో అవయవాల ఎదుగుదల పూర్తిగా లేదని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం లేదా ఖమ్మం తరలించాల్సి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వాళ్లు వెళ్లడానికి నిరాకరించారు. దీంతో చింతూరులోనే వైద్యం చేసేందుకు నిర్ణయించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి నిరంతర పర్యవేక్షణలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్ష, ఎస్ఎన్‌సీయూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమర్ అత్యవసర చికిత్స మందులను వినియోగించి సుమారు 80 రోజులు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించారు. దీంతో శిశువు బరువు 2.800 కేజీలకు పెరిగింది. శుక్రవారం వైద్యుల పర్యవేక్షణలో శిశువును తల్లికి అప్పజెప్పి డిశ్చార్జి చేశారు. కాగా ఎస్ఎన్‌సీయూ ద్వారా అందుతున్న సేవలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పరిశీలించి సూపరింటెండెంట్‌ను, వైద్యాధికారులను, ఎస్ఎన్‌సీయూ సిబ్బందిని అభినందించారు. సీహెచ్‌సీలో ఈ సంవత్సరంలో బరువు తక్కువగా ఉన్న 65 మంది పిల్లలకు సేవలందించామని సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో పిడియాట్రిషన్ డాక్టర్ హర్ష, డాక్టర్ ఉమర్, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి బయల్దేరి... విగతజీవిగా మారి

కుమారుడి ఆరోగ్యం బాగోలేదని మనస్థాపంతో కార్మికుడి ఆత్మహత్య

ప్రత్తిపాడు, ఆగస్టు 23: కుమారుడి ఆరోగ్యం బాగోలేదని మనస్థాపంతో తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కార్మికుడి సహచరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని లంపకలోవ వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఒడిసా రాష్ట్రం నరాల జిల్లా కలకంటికి చెందిన పప్పు మంగరాజు (21) కార్మికుడిగా పని చేస్తున్నాడు. స్వగ్రామంలో భార్య, పిల్లలను విడిచిపెట్టి కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కుమారుడి ఆరోగ్యం బాగోలేదని రెండు రోజుల క్రితం భార్య ఫోను చేసి చెప్పింది. దీంతో మంగరాజు స్వగ్రామం వెళ్లేందుకు గురువారం సామర్లకోట రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అయితే వెనక్కు మళ్లీ తాను చేస్తున్న కంపెనీ వద్దకు వచ్చేశాడు. శుక్రవారం అక్కడికి సమీపంలోని తోటలో మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సహచరులు గుర్తించి ఒడిసాకు చెందిన సూపర్‌వైజరు ఫాల్గుణకు సమాచారం తెలపడంతో అయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరి వేసుకున్న కార్మికుడిని పరిశీలిస్తున్న పోలీసులు

నేడు, రేపు 24 గంటల నృత్య నీరాజనం

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 23: శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో 24 గంటల నృత్య నీరాజనం కార్యక్రమం నృత్య సామ్రాట్ అనెం లక్ష్మణరావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 1000మంది నృత్యకళాకారులు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొంటారని తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

కలెక్టర్ షాన్‌మోహన్
జిల్లావ్యాప్తంగా గ్రామసభల నిర్వహణ
హాజరైన ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు

విజన్-2047 రూపకల్పనలో గ్రామసభలది కీలకపాత్ర






సామర్లకోట: గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, శంఖవరం: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ, కరప: సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, జగ్గంపేట: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

పిఠాపురం రూరల్, ఆగస్టు 23: విజన్-2047 రూపకల్పనలో గ్రామసభల నిర్వహణ కీలకపాత్ర అని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అన్నారు. గ్రామానికి అవసరమైన పనులను గుర్తించడంతోపాటు సమస్యలు అన్నింటిని సభలో చర్చించవచ్చునని తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కొత్తలూరి సునీత అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పలు అంశాలపై మాట్లాడారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, తహశీల్దార్ కుమారి, ఎంపీడీవో చిన్నారావు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో..

సర్పవరం జంక్షన్: సర్పవరంలో గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ షాన్ మోహన్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కర్రె స్వప్న, ఎంపీపీ బందిరి విరీష, కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, చైర్మన్ శ్రీను, కరెడ్లగోవిందు పాల్గొన్నారు. వాకలపూడి పంచాయతీ కార్యాలయంవద్ద ప్రత్యేకాధికారి టీవీ నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: దేశంలోనే మొదటిసారిగా పంచాయతీల పరిపాలన గ్రామ ప్రజల చేతిలోనే ఉండాలన్న ప్రధాన ధ్యేయంతో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని అచ్చంపేట, పనసపాడు గ్రామాల్లో ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలకు ఎమ్మెల్యే రాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్‌లు వీరంరెడ్డి చినబాబు, చీకట్ల వెంకటేష్, సలాది రమేష్ పాల్గొన్నారు.

కరపలో..

కరప: కొంగోడు, గురజనాపల్లి గ్రామసభల్లో ఎమ్మెల్యే నానాజీ పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఈవోపీఆర్డీ బసవ సత్యనారాయణ, ఏపీవో జీవీ రమణకుమార్ ఉన్నారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: తాగునీటికి బదులు డ్రైనేజీ నీళ్లు తాగుతున్నామని, ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని రాఘవేంద్రపురం వాసులు గ్రామసభలో ఆందోళన వ్యక్తం చేశారు. పటవల పంచాయతీ పరిధిలోని కొత్తూరు, రామన్నపాలెం, ఈబీసీ కాలనీ, పటవల గ్రామాల్లో ప్రజలు సమస్యలు తెలిపారు. ఈవోపీఆర్డీ ఎం.భైరవమూర్తి, ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, రాయుడు గంగాధర్, కొత్తూరు కాశీ పాల్గొన్నారు.

తొండంగిలో..

తొండంగి: బెండపూడి గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి ప్రవీణ, ఎంపీడీవో మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. ఎ.కొత్తపల్లిలో టీడీపీ నాయకుడు యనమల రాజేష్, కోదాడ, పెరుమాళ్లపురంలో జరిగిన సభల్లో టీడీపీ నాయకుడు కొయ్యా రామకేశవ, ఎ.ఒంటిమామిడిలో ఎంఈవో షేక్ బాబ్జి పాల్గొన్నారు. ఉపాధి హామీ, ఇతర అభివృద్ధి పనుల తీర్మానాలను ఆమోదించారు.

తుని రూరల్‌లో..

తుని రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ సర్పంచ్‌ల జాతీయ అవార్డు గ్రహీత చింతమనీడి నాగ సోమరాజు స్పష్టం చేశారు. ఎస్.సూరవరంలో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తేటగుంట గ్రామసభలో మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, డి.పోలవరంలో పలకా సోమేశ్వరరావు, దొండవాకలో గంట్ల చిట్టిబాబు ఉన్నారు.

రౌతులపూడిలో..

రౌతులపూడి: మండలంలోని శృంగవరం గ్రామసభలో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. పూర్తి సమాచారం లేకుండా గ్రామసభకు హాజరైన ఎంపీడీవో, ఏపీవో తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: గత ప్రభుత్వంలో గాడి తప్పిన పంచాయతీ పాలనను అన్నిరంగాల్లో పరిగెత్తించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్ పనిచేస్తున్నారని పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడి శ్రీనివాస్ అన్నారు. కొత్తపల్లిలో గ్రామసభలో ఆయన మాట్లాడారు. తన వద్ద డబ్బులు కట్టించుకుని వీఆర్వో ఇంటి పట్టా ఇవ్వడంలేదని కొత్తపల్లికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. ఉప్పాడ పంచాయతీలో గ్రామసభకు ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హాజరయ్యారు. కొత్తపల్లి సర్పంచ్ గవర గంగాభవానీనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం: యర్రవరంలో గ్రామసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, సిరిపురంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి హాజరయ్యారు. ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, సూతి బూరయ్య, మైరాల కనకారావు పాల్గొన్నారు.

శంఖవరంలో..

శంఖవరం: కత్తిపూడి పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడారు. టీడీపీ నేత పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు(శివ), టీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుబాష్, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, ఉప సర్పంచ్ గౌతు నాగు తదితరులున్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: పెద శంకర్లపూడి, శరభవరం గ్రామసభలకు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ హాజరయ్యారు. చినశంకర్లపూడి గ్రామసభలో సర్పంచ్ ఏపూరి రామారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మిరియాల శ్రీను పాల్గొన్నారు. స్వల్ప వివాదాలు కారణంగా మండలంలోని గజ్జెనపూడి, ఏలూరు, పాండవుల పాలెం, బురదకోట గ్రామ పంచాయతీల్లో సాయంత్రం గ్రామసభలు నిర్వహించారు.

కోటనందూరులో..

కోటనందూరు: మండలంలో 17 పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. టీడీపీ నేత గాడి రాజబాబు, డి.చిరంజీవిరావు, భాస్కరసత్యనారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేటలో..

జగ్గంపేట, ఆగస్టు 23: జగ్గంపేట, రామవరం గ్రామాల్లో జరిగిన గ్రామసభలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు బచ్చల నాగరత్నం, వత్సవాయి సత్యనారాయణ రాజు ఉన్నారు.

జగ్గంపేట రూరల్: కాట్రావులపల్లిలో గ్రామసభకు డ్వామా పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాట్రావులపల్లి ఫిషర్మెంట్ కో ఆపరేటివ్ సొసైటీకి సంబంధించి లీజుకు తీసుకున్న 4 చెరువుల్లో పూడికతీత తీయించాలని డ్వామా పీడీకి కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కాకరపల్లి కామేష్ పాలకవర్గ సభ్యులు తీర్మానం అందించారు.

గండేపల్లిలో..

గండేపల్లి: తాళ్లూరులో సర్పంచ్ శీలామంతుల వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మురారి, గండేపల్లి, మల్లేపల్లిలో గ్రామసభలు జరిగాయి. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, రాష్ట్ర కార్యదర్శులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, నేతుల జాన్సి వసంత్,చిట్టిబాబు ఉన్నారు.

కిర్లంపూడిలో..

కిర్లంపూడి: మండలంలోని సోమవరం, కృష్ణవరం సభలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోమవరం సర్పంచ్ జ్యోతుల సీతారామలక్ష్మి, ఉపసర్పంచ్ నూతి శ్రీను, మంచికంటి శ్రీను, కుంచే తాతాజీ,మాజీ ఎంపీటీసీ పాటంశెట్టి రవి ఉన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: మండలలో కట్టమూరు, దివిలి, జి.రాగంపేట, పలు గ్రామాల్లో సభలను నిర్వహించారు.

తాటిపర్తిలో వివాదం

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామసభలో వివాదం జరిగింది. ఎస్సీ కాలనీలో జరిగిన పనులు విషయంపై ఇరువర్గాలు వివాదానికి దిగాయి. దీంతో వారికి అధికారులు సర్దిచెప్పారు.

నేడు పిఠాపురంలో మెగా జాబ్‌మేళా

పిఠాపురం, ఆగస్టు 23: వికాస ఆధ్వర్యంలో పట్టణంలోని అంజనా జూనియర్ కళాశాల, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలు ఆవరణలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. 40 కంపెనీల్లో 2,500 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టరు కె.లచ్చారావు తెలిపారు. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, సదర్ ల్యాండ్, గ్లోబల్ సర్వీసెస్, స్వేయా ఇన్ఫోటెక్, సైబర్ క్యూబ్స్, ఇండిగో ఎయిర్‌లైన్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు వివరించారు. ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకూ ఉత్తీర్ణులై 35ఏళ్లలోపు ఉన్న వారు వీటికి అర్హులని, వేతనం రూ.13వేలు నుంచి రూ.40వేలు వరకూ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ధృవీకరణపత్రాలతో ఉదయం 9గంటలకు జాబ్‌మేళా జరిగే ప్రాంతానికి చేరుకోవాలని సూచించారు.

తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం

తుని రూరల్, ఆగస్టు 23: తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే యనమల దివ్య, సభ్యులుగా కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, డాక్టర్ గంట్ల చిన్నారావు, తటపర్తి రాజా, డాక్టర్ విజయ్, పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ స్వప్న, సత్యవేణి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రత్నరాజు, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ సుబ్బారావు, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్‌రమేష్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కమిటీని పొలిట్‌బ్యూరోసభుడు యనమల రామకృష్ణుడు అభినందించారు.

రౌతులపూడిలో...

రౌతులపూడి, ఆగస్టు 23: రౌతులపూడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లుగా రౌతులపూడికి చెందిన బండారు సత్యనారాయణ, మల్లంపేటకు చెందిన రెడ్డి చిన్నయ్యనాయుడు నియమితులయ్యారు. శుక్రవారం ఆసుపత్రికి ఉత్తర్వులు అందాయి. మెంబర్లుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు.

నాగులాపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కొత్తపల్లి, ఆగస్టు 23: నాగులాపల్లి వైసీపీ గ్రామ సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి నారాయణరెడ్డి చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో నిధులు, దుర్వినియోగం, రికార్డులు నిర్వాహణ సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో ఇటీవల విచారణ నిర్వహించి తొలుత చెక్‌పవర్ రద్దు చేయడం విధితమే. సర్పంచ్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కలెక్టర్ అప్పీలు చేసుకోవడంతో సార్వత్రిక ఎన్నికల ముందు చెక్‌పవర్‌ను పునరుద్ధరించారు. మళ్లీ నిర్వహించిన విచారణలో భాగంగా సర్పంచ్ చెక్‌పవర్‌ను 6నెలల పాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీచేశారు. కొత్తపల్లి ఈవోపీఆర్డీ ఎంఎస్‌భాస్కర్ ధృవీకరించారు.

'ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం'

జేఎన్టీయూకే, ఆగస్టు 23: విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు మెంటార్‌షిప్ ప్రోగ్రాంలను అభివృద్ధి చేయడంతోపాటు అనుబంధ కళాశాలల్లో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థులకు ఉపాధి కల్పన, వ్యవస్థాపకతను పెంపొందించేందుకు హైదరాబాద్‌లోని వ్యాపార ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్ మధ్య వర్తి అయిన టీహబ్, టీవర్క్స్‌ను వీసీ సందర్శించి టీహబ్ సీఈవో శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. టీహబ్ ప్రతినిధులు సాయి అభినయ్, రవి, యువరాజ్, శిరీషా, స్వరూప ఉన్నారు.

'గ్రామాల విలీనానికి సమన్వయంతో కృషి'

కాకినాడ సిటీ, ఆగస్టు 23: కాకినాడ నగరంలో రూరల్ గ్రామాల విలీనంపై రూరల్ ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ప్రతిపాదిత రూరల్ గ్రామాలను కాకినాడలో విలీనం చేయించాలని కోరుతూ కొండబాబుకు రూరల్ మాజీ ప్రజాప్రతినిధులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. మాజీ సర్పంచ్‌లు గింజాల శ్రీనివాస్, పితాని అప్పన్న, పలివెల వీరబాబు, మాజీ ఎంపీటీసీలు మాసుమేను గంగయ్య, రాధామనోహర్ పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల ప్రతినిధులతో యనమల సమావేశం

తుని రూరల్, ఆగస్టు 23: తుని నియోజకవర్గంలో కోన ప్రాంతంలో గల ఎస్ఈజెడ్‌లో నిర్మాణమైన ఫార్మా కంపెనీల ప్రతినిధులతో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమావేశమయ్యారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో దివీస్, అరబిందో పరిశ్రమల ప్రతినిధులు, ఎస్ఈజెడ్, పొల్యూషన్ కంట్రోల్ అధికారులతో యనమల మాట్లాడుతూ కోనప్రాంత వాసులు ఇబ్బందులు లేకుండా పరిశ్రమలు ఉండాలని ఎస్ఈజెడ్‌కు భూములు ఇచ్చి త్యాగం చేసిన రైతులకు మత్స్య సంపదను కోల్పోయిన మత్స్యకారులకు అండగా నిలవాల్సిన బాధ్యత పరిశ్రమల నిర్వాహకులపై ఉందన్నారు.

ఏలేశ్వరంలో తాటాకిల్లు దగ్ధం

ఏలేశ్వరం, ఆగస్టు 23: ఏలేశ్వరంలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. శుక్రవారం తెల్లవారుజమున చైతన్యనగర్‌కాలనీకి చెందిన దుందుర్తి సూరిబాబు, పూజిత నివాసం ఉంటున్న తాటాకిల్లుపై విద్యుత్‌తీగ తెగి పడటంతో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో సామాన్లు, రూ.50వేలు నగదు కాలి బూడిదయ్యాయి. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల కుటుంబానికి నిత్యావసర సరుకులు, రూ.10వేలు నగదు అందజేశారు.

జూడాల బైక్ ర్యాలీ

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 23: కోల్‌కత్తా పీజీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి కేంద్రం నుంచి పూర్తిస్థాయి లిఖితపూర్వక హామీ వెలువడే వరకు తమ నిరసన తెలియజేస్తామని ఆర్ఎంసీ జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మనోహర్ తెలిపారు. కాకినాడ జీజీహెచ్ నుంచి అచ్చంపేట కూడలి వరకు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రూహీల, హౌస్‌సర్జన్‌లు డాక్టర్ తరుణ్, డాక్టర్ తేజస్విని పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

కాకినాడ రూరల్, ఆగస్టు 23: కాకినాడ లయన్స్ క్లబ్ హాల్లో రెడ్ కాన్వెంట్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపికచేసిన 85 మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్ళ, దుస్తులను రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి వేదుల మధు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ద్వారా ప్రతీ ఏడాది 1500మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కళ్యాణి, శ్రీను, జెరీనా ఉన్నారు.

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలిక

పిఠాపురం రూరల్, ఆగస్టు 23: తప్పిపోయిన బదిర(డఫ్ అండ్ డమ్) బాలిక తల్లిదండ్రుల చెంతకు చేరింది. ఈలోగా తమ కుమార్తెపై ఎవరో అఘాత్యం చేసి ఉంటారని తండ్రి అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి అటువంటిది ఏమిలేదని తేల్చారు. పిఠాపురం మండలం కందరాడకు చెందిన బదిర బాలిక ఈనెల 20న ఇంటి నుంచి తప్పిపోయింది. 21న సాయంత్రం పట్టణంలోని జీవన్‌నగర్‌లో తిరుగుతుండగా, స్థానికులు ఆరా తీశారు. వివరాలు చెప్పలేకపోవడంతో ఆ ప్రాంతానికి చెందిన డేవిడ్ తన ఇంటికి తీసుకెళ్లి రాత్రి ఉంచారు. 22న ఉదయం 5గంటలకే ఎవరికి చెప్పకుండా ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయిబాబు గుడి సెంటర్‌లో ఆటో డ్రైవర్ గుర్తించి ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. తన కుమార్తెను ఎవ్వరో కావాలనే తీసుకువెళ్లారని, అఘాయిత్యం చేసి ఉండవచ్చని తండ్రి పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పిఠాపురం ఎస్ఐ గుణశేఖర్ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. అటువంటిది ఏమి జరగలేదని శనివారం తేల్చారు.



'రేషన్ బియ్యం దొంగ ద్వారంపూడి'

కరప, ఆగస్టు 23: కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రేషన్ బియ్యం దొంగ అని, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు అతడు కలిసి ఈ రేషన్ బియ్యాన్ని బొక్కేసి కోట్ల రూపాయలను దోచేశారని ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. కొరుపల్లిలో ఉద్యానవన శాఖ ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ద్వారంపూడికి చెందిన వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టించేశారని, త్వరలోనే అరెస్టులు కూడా ఉంటాయని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు దేవు వెంకటేశ్వరరావు, బండారు మురళి, కొండబాబు పాల్గొన్నారు. రైతులకు ఆయిల్ ఫామ్ మొక్కలందజేశారు.

విశేష సేవలందించిన టంగుటూరి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 23: స్వాతంత్ర్య సమర యోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా విశేష సేవలందించారని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాకినాడ పిఠాపురం రాజా సర్కిల్ వద్ద ఉన్న అమరజవాన్ పార్కులోని ఆయన విగ్రహానికి శుక్రవారం అధికారులతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి లల్లి, అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, సెట్రాజ్ మేనేజర్ కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్ (కాకినాడ): జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, ఇన్‌చార్జి డీసీఆర్‌బీఎస్‌కే ప్రభాకర్, ఏవో దేవకుమారి పాల్గొన్నారు.

కాకినాడ ఎస్‌డీపీవో బాధ్యతల స్వీకరణ

కాకినాడ క్రైం, ఆగస్టు 23: కాకినాడ సబ్ డివిజినల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డీపీవో)గా శుక్రవారం పోలీసు కార్యాలయంలో విష్ణురఘువీర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని ఉమ్మడి జిల్లా ఏపీఎన్‌జీవో ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పి.వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, పి.మూర్తిబాబు కలిసి అభినందించారు.

అదనపు జూనియర్ సివిల్ జడ్జి బాధ్యతల స్వీకరణ

పిఠాపురం, ఆగస్టు 23: పిఠాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వంగా వెంకట అపర్ణ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఇదే తొలి పోస్టింగ్. ఇప్పటి వరకూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి అదనపు జడ్జిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.

కరప ఎస్ఐగా శోభన్‌కుమార్

కరప, ఆగస్టు 23: కరప ఎస్ఐగా పసుపులేటి శోభన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ తూపాటి రామకృష్ణ నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు. శోభన్‌కుమార్‌ను స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు.

పిఠాపురం తహశీల్దార్‌గా కుమారి

పిఠాపురం, ఆగస్టు 23: పిఠాపురం తహశీల్దార్‌గా ఎస్ఎల్ఎన్ కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూపరంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తానని ఆమె తెలిపారు.

26న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 23: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 26న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నామని ది గోదావరి కళాకౌముది ఫౌండేషన్ అధ్యక్షుడు బాజిబోయిన వెంకటేష్‌నాయుడు తెలిపారు. కాకినాడ సూర్యకళామందిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు జరుగుతాయన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్

తుని రూరల్, ఆగస్టు 23: కాకినాడ జీఆర్‌పీ గొన్నిబ్యాగ్, తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా వ్యక్తి గంజాయితో పట్టుబడ్డాడు. అతడి వద్ద 6.400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రైల్వే పోలీసులకు వివరాలు అందించారు. నార్త్ ఈస్ట్ ఢిల్లీకి చెందిన ప్రేజెస్ తుని రైల్వేస్టేషన్ మీదుగా ఢిల్లీకి అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్టు రైల్వే పోలీసులు వెల్లడించారు. గంజాయి విలువ రూ.31,500 ఉంటుందని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలిస్తామని తెలిపారు.



సామర్లకోటలో మహిళల పూజలు

వరలక్ష్మీ వ్రత పూజలు

సామర్లకోట, ఆగస్టు 23: శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయ ఆవరణలో ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో సుమారు 600 మంది మహిళలు చేశారు. దాతల సౌజన్యంతో భక్తులకు గాజులు, పసుపు, కుంకుమ, పూలు, రవికలు, తోరాలు, చమురు, అగరవత్తులు, హారతి కర్పూరం, చక్కెర పొంగలి, పులిహోర అందజేశారు.

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో శ్రావణ శుక్రవారం పూజలు జరిగాయి. మహిళా భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. ఉమా కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్లకు కుంకుమపూజలు, సహస్ర నామార్చనలు జరిగాయి. ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అపర్ణాదేవికి సహస్ర నామార్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టారు. హాజరైన మహిళలకు లక్ష్మీదేవి రూపు, పూజాసామాగ్రి, రవిక తదితరవస్తువులు ఉచితంగా అందచేశారు.

అన్నవరం: గ్రామంలో వాసవీ అమ్మవారు గాజుల అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

అంతరిక్ష దినోత్సవం



చెందుర్తి పాఠశాలలో భారతదేశ చిత్రపటం ఆకారంలో విద్యార్థులు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 23: గొల్లప్రోలు మండలం చెందుర్తి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. భారతదేశం చిత్రపటం ఆకారంలో విద్యార్థులు మానవహారం నిర్మించారు. హెచ్ఎం సురేష్‌కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు ఉన్నారు.

తొండంగి: పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ మాట్లాడుతూ చంద్రయాన్-3విజయంలో వివిధదశలు వివరించారు.